
సాక్షి
వనపర్తి
మంగళవారం ı 14 ı ఫిబ్రవరి ı 2023



శివనామస్మరణ
శివభక్తుల ఓంకార నామస్మరణతో నల్లమల మారుమోగుతోంది.
వివరాలు 8లో ▸



జోగులాంబ వెబ్‌సైట్..
అలంపూర్ ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 34.2 /17.4
ఉదయం నుంచి ఆకాశం నిర్మలంగా ఎండగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు చల్లగా ఉంటాయి.

మనసున మనసై..

ప్రేమికులరోజు సందర్భంగా ఆదర్శ వివాహాలు చేసుకున్న జంటల మనోగతం

స్నేహంగా మారిన పరిచయాలను ప్రేమగా మలుచుకున్నారు. ప్రేమ కోసం ప్రేమతో ఒక్కటయ్యారు. ప్రేమే వారి జీవితం. పెద్దలను సైతం ఎదురించి పెళ్లి చేసుకున్నారు. అదే ప్రేమతో పెద్దల మనస్సులు దోచుకుని వైవాహిక జీవితంలో సుఖసంతోషాలతో ముందుకు సాగుతున్నారు. దాంపత్య జీవితానికి శ్రీకారం చుట్టి కులాంతర వివాహాలు చేసుకున్న తమ వివాహాలు ఇతరులకు ఆదర్శంగా ఉండాలంటూ తపన పడుతూ.. ముందుకు సాగుతున్నారు. ఆ జంటలను ప్రేమికులరోజు సందర్భంగా 'సాక్షి' పలకరించింది.

– ఆత్మకూర్

పెద్దలను ఒప్పించేందుకు ఎనిమిదేళ్లు..



భార్యాపిల్లలతో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్

2002లో ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకుంటున్న రోజుల్లో జడ్చర్లకు చెందిన రజనిరెడ్డితో పరిచయం ఏర్పడింది. చాలా కాలం మా స్నేహం కొనసాగింది. ఇద్దరం కలిసి దాంపత్య జీవితం కొనసాగించాలని నిర్ణయించుకున్నాం. మా కులాలు వేరు కావడంతో పెద్దల నుంచి వ్యతిరేకత వచ్చింది. పెద్దలను ఒప్పించేందుకు ఎనిమిదేళ్లు ఎదురుచూసి పెద్దల సహకారంతో 2011లో మా వివాహం జరిగింది. ప్రస్తుతం మాకు కుమారుడు, కుమార్తె. మా వైవాహిక జీవితం అన్యోన్యంగా కొనసాగుతుంది.

– సాయిచంద్, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ చైర్మన్, అమరచింత

ప్రేమ పెళ్లి వద్దన్నారు..

1988లో ఎంవీరామన్ ఇంగ్లీష్ మీడియంను ఆత్మకూర్‌లో ఏర్పాటు చేశాం. పాఠశాల అవసరం రిత్యా అంగ్లభాషా బోధన కోసం కెరళా నుంచి ఉపాధ్యాయులను నియమించుకున్నాం. ఇందులో ఆన్సీ అనే ఉపాధ్యాయురాలితో ఏర్పడిన స్నేహం ప్రేమగా మారింది. కులాలు వేరు.. పెళ్లి వద్దని కుటుంబసభ్యులు తేల్చి చెప్పారు. అయినా 1996లో ఆమెను వివాహం చేస్తున్నా. అందరికి ఆదర్శంగా ఉండాలనే ఆలోచనతో నాటి నుంచి నేటి వరకు దిన దినాభివృద్ధితో పాఠశాలను ముందుకు తీసుకెళ్లి మా ఇద్దరి పిల్లలతో కలిసి గర్వంగా బతుకుతున్నాం.



కుటుంబ సభ్యులతో ఎంవీరామన్ అధినేత శ్రీధర్‌గౌడ్

– ఎం.శ్రీధర్‌గౌడ్, మాజీ ఎంపీపీ, ఎంవీరామన్ స్కూల్ అధినేత, ఆత్మకూర్

పెద్దలు అంగీకారంతో..



భార్యాపిల్లలతో రవిప్రకాష్ కుటుంబ సభ్యులు

ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా చేరిన కెరళకు చెందిన ప్రియతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఒకరినొకరు అర్థం చేసుకొని వైవాహిక జీవితానికి శ్రీకారం చుట్టాం. ప్రస్తుతం ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. భార్య ఉపాధ్యాయురాలిగా కొనసాగుతుంది. కెరళా అమ్మాయిని చేసుకున్నప్పటికీ కుటుంబ సభ్యుల్లో ఏమాత్రం వ్యతిరేకం చెప్పకుండా మా జీవనానికి పెద్దలు అంగీకారం తెలిపారు.

– రవిప్రకాష్, కండక్టర్, అమరచింత

అమరచింతకి చెందిన విజయతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. పెళ్లికి ఆమె అంగీకరించినా కులాలు వేరుకావడంతో పెద్దలు వద్దన్నారు. అయినా సరే ఒక్కటై జీవిద్దామని చెప్ప

కులాలు వేరుకావడంతో వద్దన్నారు..

దంతో స్నేహితుల సహకారంతో 2001లో ప్రేమ పెళ్లి చేసుకున్నాం. ఆమె పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలిగా, ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా కొనసాగుతుంది. మాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కొనసాగుతూనే ఎంతో ఆనందంగా మా జీవనాన్ని కొనసాగిస్తూ.. ప్రేమ పెళ్లి కరెక్ట్ అని నిరూపించుకున్నాం.

– అరుణ్‌కుమార్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు, ఆత్మకూర్



కుటుంబ సభ్యులతో అరుణ్‌కుమార్



భార్యాపిల్లలతో తిరుమలేష్

పెద్దలను ఎదురించి పెళ్లి చేసుకున్నాం..

కులాలు వేరు కావడంతో ప్రేమ పెళ్లికి కుటుంబ పెద్దలు అంగీకరించలేదు. అయినా దాంపత్య జీవితానికి ఇరువురి భావాలు ఏకమయ్యాయి. ఎలాగైనా పెళ్లి చేసుకోవాలని స్నేహితుల సహకారంతో బీచుపల్లి ఆంజేయస్వామి ఆలయంలో 1998లో వివాహం చేసుకున్నాం. కొన్ని రోజులకు పెద్దలు అంగీకరించి ఇంటికి రానిచ్చారు. ప్రస్తుతం భార్య సరిత, ఇద్దరు పిల్లలతో సంతోషంగా జీవిస్తున్నాం.

– తిరుమలేష్, అమరచింత

ఇష్టపడ్డాం.. చాలా కష్టపడ్డాం..



కుటుంబ సభ్యులతో చైర్‌పర్సన్ గాయత్రి రవియాదవ్

మేమిద్దరం ఇష్టపడ్డాం. జీవితంలో ఒక్కటవ్వాలనుకున్నాం. ఇందు కోసం ఎంతో కష్టపడాల్సి వచ్చింది. పెద్దలు ఒప్పుకోకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. స్నేహితుల సహకారంతో 2004లో ప్రేమపెళ్లి చేసుకుని ఒక్కటయ్యాం. కొన్నాళ్లకే పెద్దలు అంగీకరించి ఆశీర్వదించారు. మాకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం నా భార్య గాయత్రి ఆత్మకూర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతుంది. ప్రజాసేవతో పాటు, మా వైవాహిక జీవితం ఎంతో అన్యోన్యంగా కొనసాగుతుంది.

– రవియాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, ఆత్మకూర్

న్యూస్‌రీల్

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తిటౌన్: 2022–23 విద్యాసంవత్సరానికి మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్స్ (పార్ట్ టైమ్ జాబ్‌కు) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహబూబ్‌నగర్ (రీజియన్) ప్రాంతీయ సమన్వయ అధికారి కె.నాగార్జున రావు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి, సెట్/నీట్/పీహెచ్‌డీ చేసిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 16వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 17న ఉదయం 10 గంటలకు అదే కళాశాలలో డెమోకు హాజరు కావాలని చెప్పారు. పూర్తి వివరాలకు 7901097704, 8801258359 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రాక్టికల్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలి



వనపర్తిటౌన్: ఇంటర్ బోర్డు ప్రాక్టికల్ పరీక్షలను ఎలాంటి అవకతవకలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలి ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాల కళాశాల ప్రిన్సిపాల్స్‌ను డీఐఈఓ జాకీర్ హుస్సేన్ ఆదేశించారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ కళాశాలలో ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం ఏర్పాటు చేసి ఈ మేరకు మాట్లాడారు.. ప్రాక్టికల్ పరీక్షలు ముగిసిన వెంటనే విద్యార్థులను బోర్డు పరీక్షలకు సంసిద్ధులను చేయాలని సూచించారు. రాష్ట్రంలో అధిక ఉత్తీర్ణత వనపర్తి సాధించేలా ప్రత్యేక చొరువ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్, డీఈసీ మెంబర్స్ ప్రకాశం శెట్టి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సేవాభావంతో పనిచేసినప్పుడే ఫలితాలు

వీపనగండ: కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొంటున్న వైద్య సిబ్బంది సేవాభావంతో పనిచేసినప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయని జిల్లా అదనపు వైద్యాధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ.. నిర్ధారించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. గ్రామంలోని అర్హులైన వారంతా కంటి పరీక్షలు చేయించుకోవడంలో ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యుల సహకారాన్ని తీసుకోవాలని ఆయన వైద్య సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది, వైద్యులు, తమ పాత భవనమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి షిఫ్ట్ కావాలని అన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు నూతన వైద్య సిబ్బంది నియామకం అవుతున్న సందర్భంగా వారికి ఇబ్బంది కలుగకూడదనే ఉద్దేశంతో పీహెచ్‌సీ సిబ్బంది సొంత భవనానికి వెళ్లాలని తెలియజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వంశీకృష్ణ, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించనందుకే విద్యుత్ కోతలు



వనపర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల కోట్ల విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యుత్ కోతలు ఉత్పన్నమయ్యాయని మాజీ మంత్రి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బాలానగర్ కరెంట్ ఆఫీస్ ఎదుట కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ధర్నాకు చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యుత్ కోతలతో చేతికి వచ్చిన పంటలు ఎండిపోతున్నాయని, రైతులకు 24 గంటల కరెంట్ ఏమైందని ప్రశ్నించారు. కేసీఆర్ ధనదాహంతో విద్యుత్ కొనుగోళ్లలో రూ.వేల కోట్ల కుంభకోణానికి రాష్ట్ర ప్రభుత్వం పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్కువ ధరకే విద్యుత్‌ను ఇస్తామంటే, కేసీఆర్ ప్రభుత్వం కమీషన్ల కక్కుర్తితో ప్రైవేట్ సంస్థలతో ఎక్కువ ధరలకు ఒప్పందాలు చేసుకుందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో.. పోతుందో తెలియకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం విద్యుత్ సర్కిల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అభిలాష్ రావు, డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్, నాయకులు ప్రశాంత్, అయ్యూబ్ ఖాన్, కోట్ల రవి, యాదయ్య పాల్గొన్నారు.

జలశక్తి అభియాన్ పనులు పరిశీలన

కొత్తకోట రూరల్(పెద్దమందడి): జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా భూగర్భ జలాలు పెంచేందుకు చేసినటువంటి పనులను పెద్దమందడి సమీపంలో సోమవారం కేంద్ర బృందం పర్యవేక్షించింది. ఇంకుడు గుంతలు, చెక్‌డ్యాం నిర్మాణాలు, కందకాలు, నర్సరీల ఏర్పాటు తదితర పనలను కేంద్ర బృందం సభ్యులు పర్యవేక్షించారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు విట్టల్ మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల తర్వాత భూగర్భ జలాలు పెరిగాయన్నారు. గతంలో రైతులు 150 మీటర్ల లోతు బోర్లు వేసినా.. నీళ్ల వచ్చే పరిస్థితి ఉండేది కాదని, ప్రస్తుతం 60 మీటర్ల లోతులోనే నీళ్ల రావడం జరుగుతుందన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసి ప్రతి నీటిబొట్టును భూమిలోకి వెళ్లేలా చూడాలన్నారు. డీఆర్‌డీఓ నర్సింహులు, ఎంపీపీ మేఘారెడ్డి, రఘుపతిరెడ్డి, అఫ్జల్ పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సౌకర్యాలుండాలి

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, పక్కన మార్కెట్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి

వనపర్తి: ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో రైతులకు మెరుగైన సౌకర్యాలుండాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సూచించారు. సోమవారం తన కార్యాలయంలో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, అదనపు డైరెక్టర్ రవికుమార్, ఎస్‌ఈ రాధాకృష్ణమూర్తి, జేడీ ఇఫెకార్ అహ్మద్, డీడీ పద్మహర్ష, డీఎం స్వరణ్‌సింగ్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. యాసంగి పంటలకు గిట్టుబాటు ధర దక్కాలని, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల పరిధిలో పండే వేరుశగన ఉత్పత్తులకు అత్యధిక డిమాండ్ ఉందని, పెద్దఎత్తున విక్రయానికి మార్కెట్‌లకు తీసుకొచ్చే రైతులకు కావాల్సిన మౌలిక వసతులను అధికారులు సమకూర్చాలని ఆదేశించారు. కొనుగోళ్లలో పారదర్శకత, ఉన్నతాధికారుల పర్యవేక్షణ ప్రతి మార్కెట్‌పై ఉండాలన్నారు.

వనపర్తి మార్కెట్‌లో రూ.5 భోజనం..

హరే రామ – హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.5 భోజనం రైతుల కోసం ఏర్పాటు చేసేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. పది రోజుల్లో ఇందుకు సంబంధించిన ప్రొగ్రెస్ కనిపించాలని సూచించారు. ప్రతి యాసంగి సీజన్ జనవరి నుంచి మార్చి వరకు మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలను దృష్టిలో ఉంచుకుని రైతులకు భోజన వసతి ఏర్పాటు చేయాలన్నారు.

మార్కెట్ పనులు వేగంగా..

గద్వాల జిల్లాలో నిర్మాణం చేస్తున్న సమీకృత మార్కెట్ యార్డు పనుల్లో వేగం పెంచాలని, వనపర్తి జిల్లా కేంద్రంలోని పాత గంజిలో నిర్మాణం చేస్తున్న సమీకృత మార్కెట్ యార్డు పనులు మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

'పోడుభూముల రైతులకు పట్టాలివ్వాలి'



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యనాయక్

పాన్‌గల్: జిల్లాలో పోడు భూముల సమస్య తీవ్రంగా ఉందని, సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యనాయక్ డిమాండ్ చేశారు. సర్వేలు నిర్వహించి పట్టాల పంపిణీలో జాప్యం చేస్తున్నారని విమర్శించారు. పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లిలో నిర్వహిస్తున్న గిరిజన సంఘం జిల్లా 2వ మహాసభలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఆయా ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీనివాసపురం, నాగవరం గ్రామాల్లో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వ విద్యాసంస్థల నిర్మాణం పేరుతో భూములు లాగుకోవడంతో సాగు చేసుకుంటున్న రైతులు కూలీలుగా మారారన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న పది సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసేలా సభలో తీర్మానం చేశారు.

15 మందితో జిల్లా కమిటీ..

జిల్లా నూతన కమిటీని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మనాయక్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా రవినాయక్, ప్రధాన కార్యదర్శిగా బాల్యనాయక్, ఉపాధ్యక్షులుగా మాత్రునాయ, క్సోమ్లునాయక్, సహాయ కార్యదర్శులుగా చిట్టెమ్మ, హరిశంకర్, గోవింద్‌నాయక్ కమిటీ సభ్యులుగా ఏడుగురిని నియమించినట్లు పేర్కొన్నారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు, వివిధ తండాల గిరిజనులు పాల్గొన్నారు.

ప్రజా'వాణి'కి ప్రాధాన్యం

- కొత్త కలెక్టర్ రాకతో పెరిగిన అర్జీల సంఖ్య
- అర్జీదారుల ఎదుటే సమస్య పరిష్కారానికి చర్యలు



ఈ ఫొటోలో కనిపించే వ్యక్తి పాన్‌గల్ మండలం శాఖాపూర్‌కి చెందిన మహ్మద్ సుల్తాన్ ఈయన తమ గ్రామంలో ముస్లిం శ్మశానవాటికకు వెళ్లటానికి సరైన దారిలేదు ఏర్పాటు చేయించాలని ఇదివరకే నాలుగు సార్లు ప్రజావాణిలో అర్జీలు దాఖలు చేశాడు. ఐదో సారి సోమవారం ప్రజావాణికి గ్రామస్తులతో కలిసి వచ్చారు. ప్రజావాణిలో కలెక్టర్‌కు అర్జీ అందజేయగా.. కలెక్టర్ అర్జీదారు ఎదుటనే పాన్‌గల్ తహసీల్దార్ యేసయ్యతో ఆన్‌లైన్ జూమ్‌కాల్‌లో మాట్లాడి వెంటనే ఈ సమస్యపై క్షేత్ర పరిశీలన చేసి రిపోర్టు నాకు పంపించటంతో పాటు స్థానికులకు విషయం వివరించాలని సూచించారు.



ప్రజలతో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి: తమ సమస్యలను నేరుగా కలెక్టర్‌ను కలిసి చెప్పుకొనేందుకు ఏర్పాటు చేసిన ప్రజావాణికి తగిన ప్రాధాన్యం ఇచ్చేందుకు కలెక్టర్ చొరవ చూపించారు. ఇరుకైన ప్రదేశంలో ప్రజావాణి నిర్వహించటంతో ప్రజలు చాలా మంది అసౌకర్యాలకు గురవుతున్నట్లు ప్రస్తుత కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ గుర్తించి రెండో ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటుకు ఆదేశించారు. ఎంత మంది అర్జీదారులు వచ్చినా.. సరిపడే సౌకర్యాలను అక్కడ ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను తెలుసుకునేలా చర్యలు చేపట్టారు. ఇదివరకు ఇరవైకి మించి అర్జీలు వచ్చేవి కావు. ప్రస్తుత కలెక్టర్ హాజరైన రెండో ప్రజావాణికి 75 అర్జీలు దాఖలు కావటం గమనార్హం.

ఆర్భాటం లేకుండా..

ఎలాంటి ఆర్భాటం లేకుండా ఎక్కడా ప్రచారం లేకుండానే.. అధికారులకు సూచనలు చేయటంతో ప్రజావాణి నిర్వహణ తీరులోనే.. చెప్పుకోదగిన మార్పులు వచ్చాయి. ప్రజల సమస్యలు ఓప్పిగా వింటూ.. నేరుగా సంబంధిత అధికారులను అక్కడి నుంచి పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తూ.. ప్రజల మనస్సులో సమస్య పరిష్కారానికి అధికారి స్పందన సంతృప్తినిచ్చేలా పరిపాలనలో తన మార్కును ప్రస్ఫుటించే ప్రయత్నం చేశారు.

75 అర్జీలు దాఖలు..

సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 75 అర్జీలు దాఖలు కాగా.. అందులో 06 పెన్షన్ మంజూరు చేయాలని దాఖలు చేసినవి మిగతా 69 ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. కలెక్టర్‌కు అందజేసినవి ఉన్నట్లు గ్రీవెన్స్ సెల్ అధికారులు తెలియజేశారు.

అధికారులు అందుబాటులో ఉండేలా..

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం నుంచి ముగిసే వరకు జిల్లా వ్యాప్తంగా పద్నాలు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండేలా ముందస్తు ఆదేశాలు పంపించారు. ప్రజావాణి హాల్‌లోనే.. జూమ్ స్క్రీన్ ఏర్పాటు చేసి ఆయా మండల అధికారి, మున్సిపల్ కమిషనర్ పరిష్కరించాల్సిన సమస్యను సదరు అర్జీదారు ఎదుటనే.. కలెక్టర్ మాట్లాడి పరిష్కారం కోసం ఎటువంటి చర్యలు తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. కలెక్టరేట్‌లో అర్జీదాఖలు చేసిన ప్రతి ఒక్కరికి ఆన్‌లైన్ రసీదును అప్పటికప్పుడే.. అందజేసేలా చర్యలు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయించారు.

ప్రజావాణికి 09 ఫిర్యాదులు

వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 09 ఫిర్యాదులు వచ్చాయి. ఆయా మండలాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు ప్రజావాణిలో ఏఎస్పీ షాకీర్ హుస్సేన్‌కు వినతులు అందజేశారు. వినతులు స్వీకరించిన ఆయన వారి సమస్యలు నేరుగా అడిగి తెలుసుకున్నారు. 03 భూ ఫిర్యాదులు, 3 భార్యాభర్తల గొడవలు, 3 పరస్పర గొడవలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఎలాంటి పెండింగ్ లేకుండా త్వరితగతని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్

వనపర్తి క్రైం: మెరుగైన వైద్య సదుపాయం కోసం ఎంతో నమ్మకంతో ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేదలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా జనరల్ ఆస్పత్రి ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను కలెక్టర్ పరిశీలించి రోగులతో మాట్లాడారు. రోగులకు వైద్యం ఎలా అందుతుందో? భోజ న సదుపాయం కల్పిస్తున్నారా లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని, వైద్యులు, సిబ్బంది సకాలంలో హాజరై వైద్య సేవలు అందించాలని ఆదేశించా రు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వైద్యసేవలు అందించాలని, ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. డాక్టర్ నరేంద్ర కుమార్, డాక్టర్ చైతన్య గౌడ్ ఉన్నారు.

క్లుప్తంగా

కారు ఢీకొని మహిళ మృతి


చిట్టెమ్మ (ఫైల్)

గోపాల్‌పేట: ప్రమాదవశాత్తు కారు ఢీకొని మహిళ మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ మల్లేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం మండల కేంద్రానికి చెందిన ఉత్తరయ్య కుమారుడు శివకుమార్ పెళ్లి జరిగింది. అనంతరం రాత్రి పెళ్లి భరాత్ నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు స్థానికురాలు చిట్టెమ్మ రాగా, భరాత్‌లో కొంకి దినేష్ అనే వ్యక్తి కారులో వెళ్తున్నాడు. ఈ క్రమంలో కారు బ్రేక్‌కు బదులుగా ఎక్సలేటర్ తొక్కడంతో చిట్టెమ్మను ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. చిట్టెమ్మ కుమారుడు రాకేష్ ఫిర్యాదు మేరకు కొంకి దినేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి..


యాదయ్య (ఫైల్)

నవాబుపేట: మండల పరిధిలోని దొడ్డిపల్లి చెందిన పిచ్చకుంట్ల యాదయ్య (48) సోమవారం తన బైక్‌పై వస్తుండగా కొల్లూర్ సమీపంలో అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు అతని ఆధారాలు పరిశీలించి మండల పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

చేపల వేటకు వెళ్లి


చంద్రయ్య(ఫైల్)

రాజాపూర్: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని ముదిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మేకల చంద్రయ్య(38) ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి చేపల వేటకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ తెలువలేదు. సోమవారం గ్రామ శివారులో ఉన్న దుందుభి వాగు శివారులో వెతుకుతుండగా పక్కనే ఉన్న గుంత గడ్డపై చంద్రయ్య దుస్తులు కనిపించాయి. గుంతలో దిగి గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కొల్లాపూర్: పట్టణానికి చెందిన పిట్టల శ్రీనివాసులు(55) అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతి చెందాడు. ఈయన కొంతకాలంగా ఇంటికి దూరంగా ఉంటున్నాడు. సోమవారం ఉదయం మున్సిపల్ కార్యాలయం వెనుక పడి ఉన్నాడు. అతని ముఖంపై రక్తపు మరకలు ఉండడంతో కుమారుడు ప్రవీణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల వెంకటరమణ వెల్లడించారు.

రైలు ఢీకొని మహిళ..

మహబూబ్‌నగర్ క్రైం: రైలు పట్టాలుదాటుతున్న ఓ మహిళను రైలు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స కోసం జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. రైల్వే ఎస్‌ఐ అక్బర్ కథనం ప్రకారం.. బాదేపల్లికి చెందిన బాల నాగమ్మ(72) ఆదివారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో జడ్చర్ల రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుంటే రైలు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్సకోసం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్య



లింగాల: కుటుంబసభ్యుల గొడవల కారణంగా క్షణికావేశంలో మహిళా ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గడ్డి ఎల్లమ్మ(45) కుటుంబ సభ్యులతో ఆదివారం రాత్రి గొడవ జరిగింది. దీంతో క్షణికావేశంలో ఎల్లమ్మ క్రిమి సంహారక మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఎల్లమ్మను అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి భర్త చంద్రయ్య, ఒక కుమారుడు ఉన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో కొన్నేళ్ల నుంచి ఎల్లమ్మ మధ్యాహ్న భోజనం వంట మనిషిగా పని చేస్తున్నది. విషయం తెలుసుకున్న హెచ్‌ఎం పర్వతాలు, ఉపాధ్యాయులు ఆమె మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.

అభయారణ్యంలో శివనామస్మరణ

- శ్రీశైలానికి పాదయాత్రగా చేరుకుంటున్న భక్తులు
- 18న మహాశివరాత్రి


దాతలు ఏర్పాటు చేసిన శిబిరాల్లో సేద తీరుతున్న శివభక్తులు

అచ్చంపేట: హర హర మహాదేవ శంభో శంకర.. ఓం నమః శివాయ.. శివాయ నమ ఓం.. అంటూ నల్లమల అటవీ ప్రాంతం మూడు రోజులుగా శివనామస్మరణతో మారుమోగిపోతుంది. దేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలం అష్టాదశ మహాశక్తి పీఠాల్లో ఒకటైన శ్రీ భ్రమరాంబ మహా శక్తి పీఠం స్వయంభుగా వెలిసిన శ్రీశైలం కొండలపై కొలువు దీరింది. ప్రతి ఏటా శ్రీశైలంలో మహాశివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. శివదీక్ష చేపట్టిన భక్తుల శరణు గోషతో నల్లమల ప్రాంతం ప్రతిధ్వనిస్తోంది.

■ రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు శివదీక్ష చేపడుతున్నారు. దీక్ష చేపట్టిన శివస్వాములు వివిధ ప్రాంతాల నుంచి కాలి నడకన శ్రీశైలం చేరుకొని మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా దీక్షను విరమిస్తారు. శివస్వాములు నిత్యం ఉదయం, సాయంత్రం పవిత్ర స్నానాలు ఆచరించి శివాలయాల్లో లింగార్చన, బిల్వార్చనలతో పూజలు చేస్తూ.. రుద్రనమక చమకాలతో ఆ కైలాసనాథుడిని కొలుస్తున్నారు.

చరిత్ర ప్రకారం..

పూర్వం అర్జునుడు శివుడి వరప్రసాదమైన పాశుపతాస్త్రం కోసం శివ దీక్షను స్వీకరించి ఘోర తపస్సు చేసినట్లు శ్రీకాళహస్తి మత్స్యములో చెప్పబడింది. అర్జునుడి ద్వారా దీక్ష పొందిన మార్గమే నేటి మానవులకు ముక్తి మార్గమని శివదీక్షను అనుసరిస్తూ భక్తులు దీక్షా సమయంలో తన్మయులవుతున్నారు. శివదీక్షలో ఉన్న వారు ఒక్కపూట భిక్ష మాత్రం తీసుకొని రాత్రి అల్పాహారంతో సరిపెట్టుకొని దీక్షను కొనసాగిస్తున్నారు. ప్రతి శివభక్తుడు తనసొంత ఖర్చులతో ఇంట్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, తోటి శివస్వాములకు భిక్షను ఇవ్వాలి. ఇలా శివరాత్రి వరకు శివభక్తులు నియమాల ప్రకారం నడుచుకొని శ్రీశైలానికి వెళ్లి అక్కడ దీక్షను విరమిస్తారు. శ్రీశైలం వెళ్లే రోజు జ్యోతిర్ముడిని ధరించి కొంత మంది కాలినడక మార్గాన, కొందరు వాహనాల్లో శ్రీశైలం యాత్రను చేస్తారు.

భక్తుల సందడితో నల్లమల

శివదీక్ష చేపట్టిన భక్తుల సందడితో నల్లమల ప్రాంతం కళకళలాడుతోంది. ఇరుముడి నెత్తిన పెట్టుకుని వందల మైళ్ల దూరం నుంచి దట్టమైన అడవి వెంట శివభక్తులు శివనామస్మరణ చేస్తూ.. శ్రీశైలం వెళ్తున్నారు. దీంతో ఈ ప్రాంతమంతా శివనామస్మరణతో నల్లమల కొండలు, గుట్టలు పరిసరాలు పులకించిపోతున్నాయి.

ఆధ్యాత్మికంలో ఆనందం..

పంచాక్షరి నామజపం ఆ మల్లికార్జునస్వామి శివదీక్షను స్వీకరిస్తే తమకున్న కష్టాలన్నీ తొలగిపోతాయని, కుటుంబమంతా ఆయురారోగ్యాలతో ఉంటారని భావిస్తుంటారు. రవాణా సౌకర్యాలు ఉన్నా.. దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో శివ నామసంకీర్తనలు చేసుకుంటూ కాలి నడకన కొండలు, గుట్టలు, బండరాళ్లను, ముళ్లకంపలను అడ్డు తొలగించుకుంటూ శ్రీశైలం చేరుకుంటున్నారు. ఈ ప్రయాణం శరీరానికి ఎంతో బాధ కలిగించినప్పటికీ మనస్సు మాత్రం ఆధ్యాత్మికానందంతో పులకిస్తుందని, అది ప్రత్యక్షంగా అనుభవిస్తే తెలుస్తుందని శివభక్తులు చెబుతున్నారు. వందల కిలోమీటర్ల దూరం నుంచి ఎండలను సైతం లెక్క చేయకుండా, పుడమి తల్లి వేడికి పాదాలు బొబ్బలెక్కుతున్నా.. మదిలో ప్రతిధ్వనిస్తున్న శివనామస్మరణతో కైలాస ద్వారం చేరుతున్నామని పేర్కొంటున్నారు. సదాశివుడికి ఇష్టమైన మహాశివరాత్రి పండుగ ఈ నెల 18న జరుగనుంది.

ఎక్కడెక్కడి నుంచి..

ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి పాదయాత్ర ద్వారా శివభక్తులు శ్రీశైలం చేసుకుంటున్నారు. జిల్లాలోని మహబూబ్‌నగర్, షాద్‌నగర్, జడ్చర్ల, గద్వాల, అలంపూర్, కొల్లాపూర్, నారాయణపేట, కొడంగల్, దేవరకద్ర, కర్ణాటక, వికారాబాద్, తాండూరు నుంచి నాగర్‌కర్నూల్– అచ్చంపేట మీదుగా శ్రీశైలం వస్తుండగా.. నల్గొండ, ఖమ్మం, హైదరాబాద్ రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ నుంచి వచ్చే స్వాములు కల్వకుర్తి – అచ్చంపేట మీదుగా శ్రీశైలం పాదయాత్ర చేస్తున్నారు. కొత్తకోట, ఆత్మకూర్, అమరచింత, వనపర్తి, పెద్దకొత్తపల్లి, వీపనగండ్ల, పాన్‌గల్, కోడేరు మండలాల వారు లింగాల, తూడుకుర్తి మీదుగా అచ్చంపేట దారిలో శ్రీశైలం వెళ్తున్నారు.


కాలినడకన శ్రీశైలం వెళ్తున్న శివస్వాములు


అచ్చంపేటలో శివ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం

కొల్లాపూర్ రేంజ్‌లో పెరిగిన వన్యమృగ సంచారం

- అడవిలోకి ప్రజలు, శివభక్తులు వెళ్లవద్దని అధికారుల సూచన


మొలచింతపల్లి సమీపంలోని అడవిలో పులుల గుర్తులను సేకరిస్తున్న ఫారెస్టు అధికారులు


కొల్లాపూర్ ప్రాంతం అడవిలో సంచరిస్తున్న చిరుత

కొల్లాపూర్ రూరల్: కొల్లాపూర్ రేంజ్ పరిధిలో వన్యమృగ సంచారం పెరిగిందని అడవిలోకి ప్రజలు, శివభక్తులు వెళ్లవద్దని కొల్లాపూర్ రేంజర్ షరత్ చంద్రారెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని నల్లమల అడవి ప్రాంతం అమరిగి, మొలచింతలపల్లి, సోమశిల, నార్లాపూర్ సమీపంలోని పెద్ద గట్టు, ఎర్రపెంట, పెద్దుటి, ఏములపాయ తదితర ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ముఖ్యంగా ప్రస్తుతం శివరాత్రి ఉన్నందున శ్రీశైలానికి వెళ్లే స్వాములు ఈ ప్రాంతం నుంచి వెళ్లవద్దని సూచించారు. శివభక్తులు ఇక్కడి అడవి నుంచి శ్రీశైలం వెళ్లడం నిషేధించడం జరిగిందన్నారు. కాలినడకన వెళ్లే శివభక్తులు మన్ననూర్ చెక్‌పోస్టు నుంచి వెళ్లాలని సూచించారు. ఈ మధ్యలో ఈ ప్రాంత అడవిలో కెమెరా ట్రాప్ ద్వారా కొల్లాపూర్ అడవి ప్రాంతంలో మూడు పెద్ద పులులు తిరుగుతున్నట్లు గుర్తించామన్నారు. వాటిలో రెండు ఆడ, ఒకటి మగ పులి ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇవి ప్రస్తుతం శివభక్తులు వెళ్లే రూట్‌లో ఉన్నాయన్నారు. గొర్రెల కాపరులు మరియు ప్రజలు అడవిలోకి వెళ్తే మంట మండించే పదార్థాలు, అగ్గిపెట్టెలు, బీడీ, సిగరెట్లు, లైటర్లు ముట్టించరాదన్నారు. ఫారెస్టు సిబ్బంది గుర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సోమశిలకు పర్యాటకులు సందర్శనకు వస్తే ఒక్కరుగా లోపలికి వెళ్లకూడదన్నారు. ఈ ప్రాంతంలో చిరుత పులి సంచారం బాగా పెరిగిందన్నారు. మా సందర్శనలో పాదాలు, మిగిలిన గుర్తులు గుర్తించామన్నారు. సందర్శకులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అడవిలోకి వెళ్లడం నిషేధించామన్నారు.

చెక్‌పోస్టు నిబంధనలు సడలింపు

మన్ననూర్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తుల సౌకర్యార్థం దృష్ట్యా అటవీ శాఖ చెక్‌పోస్టు నిబంధనలను సడలింపు చేస్తున్నట్లు డీఎఫ్ఓ రోహిత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి తరలి వస్తున్న శివస్వాములు, భక్తులకు అసౌకర్యంగా ఉండకూడదనే ఉద్దేశంతో 24 గంటల పాటూ ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. రాత్రి సమయంలో మన్ననూర్, దోమలపెంట అటవీశాఖ చెక్‌పోస్టుల వద్ద ఆపకుండా శ్రీశైలం వెళ్లేందుకు ఈ నెల 21వ తేదీ వరకు అనుమతిస్తున్నామన్నారు. ఇదే క్రమంలో స్వాములు, భక్తులు, యాత్రికులు అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి నిప్పు, ప్లాస్టిక్ పడవేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనాలను అటవీ ప్రాంతంలో నిలుపరాదని సూచించారు.

మూడ్రోజుల్లో దొంగను పట్టుకున్న పోలీసులు


రికవరీ చేసిన నగదు, వెండి వస్తువులు

గోపాల్‌పేట: ఒకేరోజు రెండు ఇళ్లు, ఒక షాపులో చోరీ చేసిన దొంగను పట్టుకుని రిమాండ్ చేసినట్లు గోపాల్‌పేట ఎస్సై మల్లేష్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. పెద్దకొత్తపల్లి మండలం మరికల్ గ్రామానికి చెందిన పిచ్చికుంట్ల వెంకటస్వామి అలియాస్ పబ్బాల వెంకటేష్‌ను, వారి అమ్మ ఈనెల 9న మంగళవారం.. ఏదైనా పని చేసుకుని బతుకుతే ఏమైతది, ఊర్లో అనవసరంగా తిరుగుతున్నావు అని కోప్పడింది. దీంతో అతను హైదరాబాద్ వెళ్తానని చెప్పి అదేరోజు బయలుదేరాడు. మంగళవారం రాత్రి గోపాల్‌పేటలోని జగదీశ్వర్‌రావు ఇంట్లో ఎల్‌ఈడీ టీవీ, వెండి వస్తువులు అపహరించాడు. అలాగే బస్టాండులోని ఓ షాపులో రూ.15 వేలు, బస్టాండుకు సమీపంలోని ఓ ఇంట్లో రూ.90వేల నగదును చోరీ చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఫింగర్‌ప్రింట్స్ ఆధారంగా దొంగను పట్టుకున్నారు. అతడి నుంచి 11తులాల వెండి వస్తువులు, రూ.97వేల నగదు, ఎల్‌ఈడీ టీవీని రికవరీ చేసి, సోమవారం రిమాండ్‌కు తరలించారు. అలాగే హైదరాబాద్‌లో 2011, 2022 సంవత్సరంలో ఉప్పల్, కల్వకుర్తి ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చాడు. ఏఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్, సిబ్బంది వంశీ, రాజేష్, శ్రీనివాస్‌రెడ్డి, అంజి చురుగ్గా పనిచేసినందు వల్లనే దొంగను త్వరగా పట్టుకోగలిగామని ఎస్సై మల్లేష్ తెలిపారు.

రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- త్రుటిలో తప్పిన ప్రమాదం


ప్రమాదానికి గురైన కర్ణాటక బస్సు

గట్టు: కర్నూలు నుంచి రాయచూర్‌కు వెళ్తున్న కర్ణాటక బస్సుకు త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. కర్నూలు–రాయచూర్ అంతర్‌రాష్ట్ర రహదారిపై మిట్టదొడ్డి స్టేజీ సమీపంలో సోమవారం మధ్యాహ్నం రాయచూర్ డిపో–2కు చెందిన ఆర్టీసీ బస్సు స్టీరింగ్ రాడ్ విగిరిపోవడంతో ఒక్కసారిగా రోడ్డు పక్కనే ఉన్న గుంతల్లోకి దూసుకెళ్లింది. ముందు టైర్లు పక్కకు జరిగి, బస్సు బాడి నేలను తాకింది. బస్సు అద్దాలు పగిలిపోయాయి. రోడ్డు పక్కనే హైటెన్షన్ విద్యుత్ స్తంభాలు ఉండగా, తృటిలో ప్రమాదం తప్పింది. అలాగే ప్రమాద సమయంలో ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 33 ప్రయాణికులున్నారు. ఎవరికీ ఎలాంటి అపాయం జరుగలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రేమ్‌కోటి, చంద్రబాబులు సంఘటనా స్థలానికి చేరుకుని కర్ణాటక ఆర్టీసీ అధికారులకు సమాచారం అందించారు. ప్రయాణికులను కర్ణాటకకు చెందిన మరో బస్సులో రాయచూర్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

మహబూబ్‌నగర్ క్రైం: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం..కర్నూలు జిల్లా గోనెగుడ్ల మండలం తిప్పనూర్ గ్రామానికిచెందిన రామలింగం (25) హైదరాబాద్‌లో కూలీ పని చేసుకోవడానికి సోమవారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో స్వగ్రామం నుంచి హైదరాబాద్‌కు ద్విచక్ర వాహనం బయలుదేరాడు. మార్గమధ్యలో దివిటిపల్లి సమీపంలో ఉదయం 5గంటల ప్రాంతంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహన్ని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి బోయ బంగారమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాజాపూర్‌లో గుర్తు తెలియని వ్యక్తి..


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రాజాపూర్: రాజాపూర్ శివారులో జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళుతున్న గుర్తుతెలియని వ్యక్తిని క్వాలీస్ వాహనం (ఏపీ 25ఆర్ 4348) ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆయనను జిల్లా ఆస్పత్రికి తరలించగా.. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు రాజాపూర్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే రాజాపూర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కొనసాగుతున్న పౌరాణిక నాటక ప్రదర్శనలు


రావణ బ్రహ్మ ఏకపాత్రాభినయం ప్రదర్శన

స్టేషన్ మహబూబ్‌నగర్: మన్యంకొండ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీమిత్ర కళా నాట్య మండలి ఆధ్వర్యంలో దేవాలయం ఆవరణలో నిర్వహిస్తున్న పౌరాణిక నాటక ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి వివిధ సంస్థలచే నాటకాలను ప్రదర్శించారు. శ్రీరామాంజనేయ యుద్ధఘట్టం, శ్రీకృష్ణ రాయబారం, శ్రీకృష్ణంజనేయ యుద్ధ ఘట్టం, రావణబ్రహ్మ, మాయలపకీర్ మరణవేదన ఏకపాత్రాభినయం ప్రదర్శించారు. ఈ సందర్భంగా శ్రీమిత్రకళానాట్య మండలి ప్రధాన కార్యదర్శి వి.నారాయణ మాట్లాడుతూ నాటక ఉత్సవాల్లో మంగళవారం మైరావణ నాటకం, శ్రీకృష్ణ రాయబారం, శ్రీరామాంజనేయ యుద్ధఘట్టం నాటకాల ప్రదర్శన ఉంటుందని, భక్తులు తిలకించాలని ఆయన కోరారు. అనంతరం శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో కళాకారులను సన్మానించి సర్టిఫికెట్లు, మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో నాట్య మండలి ఉపాధ్యక్షులు నర్సింలు, వెంకటయ్య, మాధవరాజు, రామాచారి, శేఖరాచారి, శివాచారి, దత్త్రాత్రేయచారి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్‌తో తంటాలు


బోల్తా పడిన వాహనాన్ని పైకి లేపి పక్కకు తోస్తున్న ప్రజలు


ఒకదానికి ఒకటి ఎదురుగా వచ్చి నిలిచిపోయిన వాహనాలు

దేవరకద్రలో ట్రాఫిక్ జామ్ కావడం పరిపాటిగా మారింది. అయితే సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తరచుగా ట్రాఫిక్ జామ్ అవడంతో వాహనాలు రెండువైపులా బారులు తీరాయి. ఈ క్రమంలోనే మిర్చీలోడ్‌తో వెళ్తున్న మినీ గూడ్స్ వాహనం ఆర్వోబీ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే పోలీసులు ప్రజల సహకారంతో బోల్తా పడిన వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఇక రైల్వే గేటు పడిన ప్రతిసారి వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంటుంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణం అంటేనే ప్రయాణికులు జంకే పరిస్థితి దాపురించింది. పోలీసులు రైల్వే గేటుతోపాటు బస్టాండ్ వద్ద తగిన చర్యలు తీసుకుంటే ట్రాఫిక్ సమస్య ఏర్పడదని వాహనదారులు చెబుతున్నారు. – దేవరకద్ర

మహవీర్ పరిశ్రమను మూసివేయాల్సిందే..

బాలానగర్: మండల పరిధిలోని గుండేడ్ గ్రామ శివారులోని మహవీర్ పరిశ్రమతో గ్రామస్తులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారని ఇంతగా గ్రామస్తులకు, రైతులకు, ఇతర పరిశ్రమలకు హాని కలిగించే పరిశ్రమను మూసివేయాలని గ్రామస్తులు చేస్తున్న డిమాండ్ సమంజసమే అని డీసీఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గుండేడ్ గ్రామం మహవీర్ పరిశ్రమ వద్ద గత 21రోజులుగా చేస్తున్న గుండేడ్ గ్రామస్తుల ధర్నాకు సోమవారం ఆయన మద్దతు తెలిపారు. అనంతరం మాట్లాడారు. కేవలం వంద మీటర్ల దూరంలోనే గ్రామం ఉందని, అందులో వేలమంది గ్రామస్తులు, ఇతర రాష్ట్రాల వారు నివాసం ఉంటూ పరిసరాలలోని పరిశ్రమల్లో ఉద్యోగాలు చేస్తూ జీవిస్తున్నారని అన్నారు. కానీ కేవలం రాబడే ధ్యేయంగా నడిపిస్తున్న పరిశ్రమతో గ్రామస్తులకు ఎలాంటి ఉద్యోగ అవకాశాలు లేకపోగా, కాలుష్య నియంత్రికలు ఉపయోగించకపోవడంతో దారుణమని అన్నారు. దీనివల్ల తీవ్ర వాయుకాలుష్యం ఏర్పడుతోందని, అలాంటి పరిశ్రమను ఏళ్ల తరబడి ఎవరూ భరించలేరని అన్నారు. గ్రామస్తులు వందల సంఖ్యలో అనారోగ్యం బారిన పడుతున్నారని చెప్పారు. అందుకే పరిశ్రమను మూసివేయాలన్న గ్రామస్తుల డిమాండ్‌కు మద్దతు తెలుపుతున్నామని అన్నారు. సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ లింగు నాయక్, చెన్నారెడ్డి, శ్రీను తదితరులు ఉన్నారు.

ఈవెంట్స్‌కు ఏర్పాట్లు పూర్తి


మాక్ ట్రయల్ రన్ పరిశీలిస్తున్న ఎస్పీ నర్సింహ

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా స్టేడియం గ్రౌండ్‌లో ఈ నెల 15 నుంచి 21 వరకు నిర్వహించే ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలకు అన్నిరకాల ఏర్పాట్లు పూర్తి చేశామని ఎస్పీ నర్సింహ అన్నారు. జిల్లా పోలీస్ అధికారులతో కలిసి ఎస్పీ సోమవారం సాయంత్రం స్టేడియం గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి, మాక్ ట్రయల్ రన్ నిర్వహించారు. మంగళవారం రెండోసారి మాక్ ట్రయల్ రన్ ఏర్పాటు చేసి ఈవెంట్స్ నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు చేపడుతామన్నారు. ఈసారి నిర్వహించే దేహదారుఢ్య పరీక్షలు పూర్తిగా సీసీటీవీ పర్యవేక్షణలో సెన్సార్ టెక్నాలజీలో సాగుతాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్న క్రమంలో అభ్యర్థులు కేవలం సొంత సామర్థ్యంపై నమ్మకం పెట్టుకుని పరీక్షలకు హాజరుకావాలన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 6,275 మంది హాజరవుతారన్నారు. మాక్ ట్రయల్ రన్‌లో భాగంగా మొదట అభ్యర్థుల సర్టిఫికెట్స్ పరిశీలన ఆ తర్వాత 1600 మీటర్ల పరుగు పోటీ, ఎత్తు, ఛాతి, లాంగ్ జంప్, షాట్‌పుట్ నిర్వహించారు. ఈవెంట్స్ నోడల్ అధికారి, ఏఎస్పీ రాములు, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత



కోస్గి: మండల కేంద్రంలోని రామాలయం చౌరస్తాలోని రెండు దుకాణాల్లో అక్రమంగా తరలించేందుకు నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్, స్థానిక రెవెన్యూ అధికారులు కలిసి పట్టుకున్నారు. కమాండ్ల ప్రసాద్ దుకాణంలో 22 బస్తాలు, సిద్ధయ్య దుకాణంలో 11బస్తాలు మొత్తం 8.50క్వింటాళ్ళ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. పట్టుబడిన బియ్యాన్ని బాల్ నర్సయ్య రేషన్ దుకాణానికి తరలించినట్లు డీటీ ఆనంద్ తెలిపారు. దుకాణదారులపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుభాష్‌రెడ్డి ఉన్నారు.

మరికల్: అనుమతి లేకుండా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. మండల కేంద్రంలో బొలేరా వాహనంలో ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్‌ఐ కాళప్ప తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఓ రేషన్ దుకాణంలో భద్రపర్చి, వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

భర్త కనిపించడం లేదని భార్య ఫిర్యాదు

అడ్డాకుల: మండలంలోని కందూర్ చెందిన పిల్లి హన్మంతు కనిపించడం లేదని ఆయన భార్య వెంకటమ్మ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు. మూడేళ్ల నుంచి సక్రమంగా మతిస్థిమితం లేని హన్మంతు ఎవరితో మాట్లాడకుండా ఉండేవాడు. గత నెల 22న ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువులు, తెలిసిన వాళ్ల దగ్గరికి వెళ్లి వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం వెంకటమ్మ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వేసవి మంటలు..!

▶ మొదటి పేజీ తరువాయి

చెబుతోంది. అయితే ఎల్ నినో సీజన్ మొదలయ్యేందుకు ఇంకా మూడు నాలుగు నెలలు ఉన్నందున ఈ అంచనాలు తప్పు కావచ్చునని కూడా పేర్కొంది. కాగా ఈ నెలాఖరుకు తాజా అంచనాలను విడుదల చేస్తామని ఐఎండీ డైరెక్టర్ ఎం.మహాపాత్ర తెలిపారు. ఇలా ఉండగా వాతావరణంలో అనూహ్య మార్పుల వల్ల అతి భారీ, అకాల వర్షాలు, అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ఈ వేసవిలో వడగాడ్పుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని ఐఎండీ రిటైర్డ్ అధికారి రాళ్లపల్లి మురళీకృష్ణ చెప్పారు.

సమాచారం ఆందోళనకరమే: స్కైమెట్

ఈ ఏడాది ఎల్ నినో, లా నినా పరిస్థితులపై అందిన ప్రాథమిక సమాచారం ఆందోళనకరంగానే ఉందని దేశంలోనే తొలి ప్రైవేట్ వాతావరణ అంచనాల సంస్థ స్కైమెట్‌కు చెందిన మహేశ్ పలవట్ చెబుతున్నారు. 'పరిస్థితులు లా నినా నుంచి ఎల్ నినో వైపునకు మారుతున్నాయంటేనే ప్రమాదం ముంచుకొస్తోందని అర్థం. రుతుపవనాల సమయంలో ఎల్ నినో ఏర్పడితే ఈ ఏడాది వర్షాలు తగ్గుతాయి. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. 2020లోనే లా నినా పరిస్థితులు ఏర్పడి, ప్రస్తుతం కూడా అదే కొనసాగుతున్నా ఉష్ణోగ్రతలు అసాధారణ స్థాయిలో ఉండటం, గత ఏడాది కొన్నిసార్లు విపరీతమైన వడగాడ్పులు నమోదు కావడం. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిల్లోనూ ఉష్ణోగ్రతలు కొంచెం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆ తర్వాత మాత్రం అసాధారణ స్థాయిలో ఉండవచ్చు..' అని పలవట్ పేర్కొన్నారు.

సముద్ర జలాలు వెచ్చబడితే అధిక ఉష్ణోగ్రతలు

లా నినా పరిస్థితుల్లో తూర్పు నుంచి పశ్చిమం వైపు వీచే వాణిజ్య పవనాలు బలంగా ఉంటాయి. దీనివల్ల సముద్ర ఉపరితలంపై ఉండే వెచ్చటి నీరు పశ్చిమ దిక్కుకు ఎక్కువగా కదులుతుంది. అదే సమయంలో సముద్రపు లోపలి భాగంలోని శీతల జల ప్రవాహాలు తూర్పువైపునకు ప్రయాణిస్తాయి. అధిక వర్షాలకు కారణమవుతాయి. ఎల్ నినోలో పరిణామాలు మాత్రం దీనికి వ్యతిరేక దిశలో ఉంటాయి. వాణిజ్య పవనాలు బలహీనపడి ఉపరితలంపైన వెచ్చటి నీరు తూర్పు దిక్కుకు అంటే మన వైపు ప్రయాణిస్తుంది. అప్పటికే చల్లగా ఉన్న నీటిని ఇవి వెచ్చబెడతాయి. ఫలితంగా ఉష్ణోగ్రతలు పెరిగిపోతాయి. ఇండోనేసియా, ఆస్ట్రేలియాల్లోనూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. గాల్లో తేమ శాతం తగ్గిపోతుంది. ఫలితంగా రుతుపవనాలు బలహీనపడిపోతాయి. కరువులు, కార్చిచ్చులు ఎక్కువవుతాయి.

సగటు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం

ఉష్ణోగ్రతలు నమోదు చేయడం మొదలుపెట్టిన తరువాత అత్యధిక వేడి నమోదైన సంవత్సరాల్లో 2022ది ఐదో స్థానం. ఈ ఏడాది ఎల్ నినో పరిస్థితులు ఏర్పడితే ఈ రికార్డులు చెరిగిపోయే అవకాశం ఉంది. సగటు ఉష్ణోగ్రతలు శతాబ్దం క్రితంతో పోలిస్తే 1.5 డిగ్రీ సెల్సియస్ వరకు పెరగవచ్చునని అంచనా. గత ఏడాది భారత్‌లో కనీసం తొమ్మిది నగరాల్లో వేసవి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీ సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదైన విషయం ఇక్కడ చెప్పుకోవాలి. ఉత్తర, వాయవ్య, తూర్పు ప్రాంతాల్లో తీవ్రమైన వడగాడ్పులు రావచ్చని గత ఏడాది ఐఎండీ హెచ్చరించింది.

ఏర్పాట్లు చేసుకోమన్నాం..

మధ్యమ స్థాయి ఎల్‌నినో రుతుపవనాలపై ప్రభావం చూపగలదు. దీనివల్ల కురిసే వర్షాల మోతాదు తగ్గుతుంది. కానీ ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా మాత్రం రుతుపవనాలు సాధారణం కంటే తక్కువ స్థాయిలో ఉంటాయని చెప్పలేం. రానున్న మూడు నాలుగు నెలల్లో బంగాళాఖాతం, అరేబియా సముద్రాల ఉపరితల జలాల ఉష్ణోగ్రతల్లో తేడాల ఆధారంగా రుతుపవనాల తీవ్రతలో తేడాలు రావచ్చు. మొత్తం మీద ఈ సారి ఎండలు తీవ్రంగానే ఉండబోతున్నాయి. ఇందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కూడా సూచించాం.

–ఎం.రాజీవన్, ఎర్త్ సైన్స్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి

ప్రజాస్వామ్య స్ఫూర్తితో గవర్నర్ సేవలు

- విశ్వభూషణ్ హరిచందన్‌ను కొనియాడిన ఏపీ ముఖ్యమంత్రి జగన్
- గవర్నర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయిన సీఎం దంపతులు


గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ దంపతులకు జ్ఞాపికను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్, సతీమణి భారతి

సాక్షి, అమరావతి: అధికార కార్యకలాపాల నిర్వహణలో ప్రజాస్వామ్య స్ఫూర్తితో వ్యవహరించి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఎంతో రాజకీయ పరిణతి కనబరిచారని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. ఆయన గవర్నర్‌గా రాష్ట్రానికి అందించిన సేవలను ప్రజలు సదా గుర్తుంచుకుంటారన్నారు. ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా బదిలీ అయిన విశ్వభూషణ్ హరిచందన్‌తో సీఎం వైఎస్ జగన్ రాజ్‌భవన్‌లో సోమవారం భేటీ అయ్యారు. రాజ్‌భవన్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ భారతి దంపతులకు గవర్నర్ సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాశ్, ఉప కార్యదర్శి నారాయణస్వామి స్వాగతం పలికారు. అనంతరం వారిరువురూ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, సుప్రవ హరిచందన్ దంపతులతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్‌తో సీఎం మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం సాధించి సత్సంబంధాలు సాగేలా కీలక పాత్ర పోషించారన్నారు. కరోనా విపత్కర పరిస్థితులను అధిగమించి రాష్ట్రం ప్రగతిపథంలో పయనించడానికి గవర్నర్ ఎంతో సహకరించారన్నారు. విశ్వభూషణ్ హరిచందన్ బదిలీ కావడం బాధాకరమైనా మరో రాష్ట్రానికి గవర్నర్‌గా వెళ్లడం ద్వారా అక్కడి ప్రజలకు మేలు చేయగలుగుతారన్నారు.

అటవీ పరిహారం పెంపు

- వన్యప్రాణుల దాడుల్లో మరణాలు, పంట నష్టాలకు పరిహారం పెంచాలని వైల్డ్ లైఫ్ బోర్డు ప్రతిపాదనలు
- అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వన్యప్రాణుల దాడుల్లో (పులులతో సహా) మరణాలు, పంట నష్టాలకు పరిహారం పెంచాలని రాష్ట్ర వైల్డ్ లైఫ్ బోర్డు నిర్ణయించింది. ప్రస్తుతం రూ.ఐదు లక్షలు ఉన్న పరిహారాన్ని పది లక్షలకు పెంచుతూ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపనున్నారు. సాధారణ గాయాలైతే వాస్తవ వైద్యం ఖర్చు (లక్షకు మించకుండా), తీవ్రంగా గాయపడితే వైద్యానికి అయ్యే ఖర్చు (మూడు లక్షలకు మించకుండా), అంగవైకల్యం ఏర్పడితే లక్ష పరిహారం, పెంపుడు జంతువులు చనిపోతే వాస్తవ అంచనా, పంట నష్టానికి ప్రస్తుతం ఎకరాకు ఆరువేలు ఉన్న పరిహారాన్ని రూ.7,500కు పెంచాలని, పండ్ల తోటలకు నష్టపరిహారం కూడా రూ.7,500కు (గరిష్టంగా యాభై వేల దాకా) పెంచాలని కమిటీ ప్రతిపాదించింది. సోమవారం అరణ్య భవన్‌లో అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర వన్యప్రాణి మండలి (వైల్డ్ లైఫ్ బోర్డు), మనుషులు – జంతువుల మధ్య ఘర్షణ వాతావరణం తగ్గించే చర్యల సూచనల కమిటీ సమావేశాలు జరిగాయి.

- అటవీశాఖ నేతృత్వంలో అడవుల రక్షణ, వన్యప్రాణి సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్ వివరించారు. రాష్ట్రంలో మొదటి సారి చేపట్టిన పులుల ఆవాసాల్లో ఉన్న మానవ ఆవాసాల తరలింపు (కవ్వాల్ లో రెండు గ్రామాలు) ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని తెలిపారు.

వైల్డ్ లైఫ్ బోర్డు సమావేశంలో కీలక నిర్ణయాలు

- హైదరాబాద్ వనస్థలిపురంలో బస్ టెర్మినల్ నిర్మాణానికి వన్యప్రాణి మండలి ఆమోదం తెలిపింది.
- హరిణి వనస్థలికి చెందిన 1.354 హెక్టార్ల అటవీ భూమి నిబంధనలకు అనుగుణంగా మళ్లింపును అనుమతిని ఇచ్చారు. జాతీయ రహదారిలో విపరీతంగా పెరిగిన రద్దీ, ప్రయాణీకుల సౌకర్యం కోసం ఈ టెర్మినల్ నిర్మాణం కానుంది.
- శ్రీశైలం రహదారి విస్తరణ కోసం వచ్చిన ప్రతిపాదనను అమ్రాబాద్ లో ఉన్న వన్యప్రాణి సంరక్షణ దృష్టిలో పెట్టుకుని బోర్డు తిరస్కరించింది. ఇతర రోడ్లు, ఇరిగేషన్, (కడెం పరిధిలో లక్ష్మీపూర్ లిఫ్ట్, నాగార్జున సాగర్ పరిధిలో పెద్ద గుట్ట లిఫ్ట్) కేబుల్ పనులకు బోర్డు ఆమోదం తెలిపింది. వన్యప్రాణులు ప్రమాదంలో పడ్డప్పుడు కాపాడేందుకు అవసరమైన రెస్క్యూ టీమ్‌ల సంఖ్యను పెంచాలని నిర్ణయించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, వనమా వెంకటేశ్వరరావు, సభ్యులు కోవ లక్ష్మి, రాఘవ, బానోతు రవి కుమార్, అనిల్ కుమార్, పీసీసీఎఫ్ (ఎఫ్‌ఏసీ) ఎం.సీ.పర్గెయిన్, అటవీశాఖ అడిషనల్ సెక్రటరీ ప్రశాంతి, ఓఎస్డీ శంకరన్ పాల్గొన్నారు.

నికర అప్పు 2,83,452 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

జాతీయ బ్యాంకులు, నాబార్డు లాంటి ఆర్థిక సంస్థలు ఇచ్చిన రుణాలను సంవత్సరాలవారీగా వెల్లడించాలని కోరుతూ నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభలో లిఖితపూర్వకంగా వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సమాచారం మేరకు ఈ అప్పుల లెక్కలను వివరించారు. ప్రభుత్వరంగ బ్యాంకుల నుంచి తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకు రుణాలేవీ తీసుకోలేదని పేర్కొన్నారు. 2014 జూన్ 2 నుంచి 2021–22 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఎఫ్ఆర్‌బీఎం చట్టానికి లోబడి రూ.2.84 లక్షల కోట్ల నికర అప్పు తెలంగాణ ప్రభుత్వానికి ఉందన్నారు. నికర అప్పుతోపాటు నాబార్డు, వివిధ బ్యాంకుల నుంచి పలు కార్పొరేషన్లు తీసుకున్న రుణాలను కూడా ఈ సమాధానంలో కేంద్రం సవివరంగా పేర్కొంది. ఈ వివరాల ప్రకారం రాష్ట్ర అప్పులు 2016–17లో రూ. లక్ష కోట్ల మార్కు దాటితే 2019–20లో రూ. 2 లక్షల కోట్ల మార్కు దాటాయని వెల్లడించింది.

12 బ్యాంకుల నుంచి కార్పొరేషన్ల రుణాలు

రాష్ట్రం ఏర్పాటయ్యాక 12 జాతీయ బ్యాంకుల నుంచి కార్పొరేషన్లకు రుణాలు లభించినట్లు కేంద్రం లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించింది. ఈ బ్యాంకులన్నింటి ద్వారా 2014 జూన్ నుంచి 2022 అక్టోబర్ వరకు మొత్తం రూ. 1.28 లక్షల కోట్లను ప్రభుత్వం పూచీకత్తు ఉండి కార్పొరేషన్లకు ఇప్పించిందని తెలిపింది.

భగీరథకు 'నిడా' రుణాలు

నాబార్డు ద్వారా వివిధ నిధుల కింద కూడా తెలంగాణ ప్రభుత్వరంగ కార్పొరేషన్లు రుణాలు తీసుకున్నాయని కేంద్రం వెల్లడించింది. ఇందులో గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి (ఆర్ఐడీఎఫ్) కింద రూ. 7,144 కోట్లు, వేర్‌హౌస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (డబ్ల్యూఐఎఫ్) కింద రూ. 85,227.94 కోట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ ఫండ్ (ఎఫ్‌పీఎఫ్) కింద రూ. 1,007.10 కోట్ల మేర రుణాలు తీసుకున్నట్లు తెలిపింది. నాబార్డు మౌలిక వసతుల అభివృద్ధి సాయం (నిడా) కింద రూ. 11,424 కోట్లను అప్పుగా తీసుకున్నట్లు వివరించింది. ఇందులో మిషన్ భగీరథ ప్రాజెక్టుకు తెలంగాణ తాగునీటి సరఫరా కార్పొరేషన్ లిమిటెడ్ (టీడీడబ్ల్యూఎస్‌సీఎల్) ద్వారా ఉమ్మడి మెదక్, రంగారెడ్డి, నిజామాబాద్, ఖమ్మం, నల్లగొండ, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని సెగ్మెంట్లలో భగీరథ పనులు చేసేందుకు రుణాలు తీసుకున్నారని తెలిపింది. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ (కేఐపీసీ) ద్వారా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, కొమురెల్లి మల్లన్న రిజర్వాయర్, నృసింహసాగర్ (బస్వాపూర్) రిజర్వాయర్ల నిర్మాణం కోసం ఈ రుణాలు సేకరించినట్లు పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానంలో స్పష్టం చేశారు.

తెలంగాణ ఏర్పాటైన తర్వాత తీసుకున్న రుణాలు (సంవత్సరాల వారీగా)

సంవత్సరం	నికర అప్పు	ఆ ఏడాది పెరిగిన అప్పులు (రూ. కోట్లలో)
2014 జూన్ 2 నాటికి	75,577	-
2014-15	83,698	8,121
2015-16	99,213	15,515
2016-17	1,29,532	30,319
2017-18	1,52,190	22,658
2018-19	1,75,281	23,091
2019-20	2,05,858	30,577
2020-21	2,44,019	38,161
2021-22	2,83,452	39,433


నాబార్డు ద్వారా మంజూరైన, తీసుకున్న అప్పులు (2022 అక్టోబర్ నాటికి)

నిధి	మంజూరైన రుణం	వచ్చిన రుణం (రూ. కోట్లలో)
ఆర్ఐడీఎఫ్	8,873	7,144
డబ్ల్యూఐఎఫ్	97,278.89	85,227.94
ఎఫ్‌పీఎఫ్	2,883.00	1,007.10
నిడా	14,516.65	11,424.66

(నోట్: ఈ రుణాలు వివిధ కార్పొరేషన్లకు రాష్ట్ర ప్రభుత్వం పూచీకత్తు ఉండి ఇప్పించినవి. ఇవి కాక వివిధ ప్రభుత్వరంగ బ్యాంకుల ద్వారా రూ. 1.28 లక్షల కోట్లకుపైగా రుణాలను ప్రభుత్వం పూచీకత్తు ఉండి ఇప్పించిందని కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. ఇలా కార్పొరేషన్లు తీసుకున్న రుణాలు కేంద్ర లెక్కల ప్రకారం రూ. 2.42 లక్షల కోట్ల వరకు ఉన్నాయి)

హైకోర్టులో 'కార్వీ'కి ఊరట

ఈడీ అప్పీల్ కొట్టివేత



సాక్షి, హైదరాబాద్: కార్వీ గ్రూప్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఈడీ ఎడ్జుడికేటింగ్ అథారిటీ జారీ చేసిన షోకాజ్ నోటీసులపై సమాధానం ఇవ్వడానికి కార్వీకి హైకోర్టు సింగిల్ జడ్జి రెండు నెలల సమయం ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఈడీ సీజే ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేసింది. వాదనలు విన్న ధర్మాసనం అప్పీల్‌ను కొట్టివేసింది. ఖాతాదారులకు చెందిన షేర్లను తాకట్టు పెట్టి రుణం పొంది వాటిని డొల్ల కంపెనీలకు మళ్లించారన్న ఆరోపణలపై కార్వీపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసిన ఈడీ... షేర్లు, భూములు, భవనాలు, విదేశీ కరెన్సీ, బంగారు ఆభరణాలను జప్తు చేయడం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ సంస్థ సీఎండీ పార్థసారథి సహా మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సింగిల్ జడ్జి... ఈడీ ఎడ్జుడికేటింగ్ అథారిటీ ఆస్తుల జప్తు నోటీసులపై సమాధానం ఇవ్వడానికి కార్వీకి 2 నెలల సమయం ఇచ్చారు. ఈ తీర్పును తప్పుబడుతూ ఈడీ అప్పీల్ దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ అథారిటీ 180 రోజుల్లో రిపోర్టు అందజేయాల్సి ఉంటుందని, అదనంగా సమయం ఇవ్వడం సరికాదన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. సమయ వెసులుబాటు ఇచ్చే అధికారం కోర్టులకు ఉంటుందని స్పష్టం చేసింది. సింగిల్ జడ్జి ఇచ్చిన రెండు నెలల గడువు మరో వారంలో ముగియనుండగా ఇప్పుడు సవాల్ చేయడాన్ని తప్పుబడుతూ అప్పీల్‌ను కొట్టివేసింది.

హుండీ లెక్కింపు



జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా హుండీని సోమవారం లెక్కించగా రూ.19,28,535 వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వీణ ఆధ్వర్యంలో హుండీని లెక్కించినట్లు తెలిపారు. మిశ్రమవెండి 4కిలోల300గ్రాములు, గ్రాము బంగారం భక్తుల ద్వారా వచ్చిందని చెప్పారు.

పోలేపల్లిలో..



కోస్గి: మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ దేవత ఉత్సవాలు గత నెల 9 నుంచి 13 వరకు నిర్వహించారు. ఉత్సవాలు ముగియడంతో భక్తులు కానుకలుగా సమర్పించిన నగదు, ఇతర కానుకలకు ఆలయ కమిటీ, ఈఓ, దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీని సోమవారం లెక్కించారు. రూ.4,18,790 నగదు, 200 గ్రాముల వెండి వచ్చినట్లు అధికారులు తెలిపారు. లెక్కింపులో డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఈఓ రాజేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్, బుగ్గప్ప ఉన్నారు.

నేడు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం సర్వసభ్య సమావేశాన్ని స్థానిక పారిశ్రామికవాడలోని ఫోరం కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఎ.రాజసింహుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగేశ్వర్‌రావు, కోశాధికారి సయ్యద్ ఫరీద్ తదితర రాష్ట్ర నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలు, సకల జనుల సమ్మె వేతనం తదితర అంశాలపై చర్చిస్తామని, సమావేశంలో విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

జోగుళాంబ వెబ్‌సైట్ ప్రారంభం

- అందుబాటులోకి ఆన్‌లైన్ సేవలు
- ఆవిష్కరించిన రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి


మంత్రి, ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాలలో ఐదవ శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల్లో నిర్వహించే పూజా కార్యక్రమాల్లో ఎక్కడ నుంచైనా పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తూ ఆన్‌లైన్ సేవలను దేవస్థానం వారు అందుబాటులోకి తెచ్చారు. ఆలయంలో నిత్యోత్సవాలు, వారోత్సవాలు, పక్షోత్సవాలు, మాసోత్సవాలు, సంవత్సరోత్సవాలు, ఆలయానికి మొక్కుబడులు చెల్లించుకునేందుకు గాను www.srijogulamba.com వెబ్‌సైట్‌ను సోమవారం హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం ఆవిష్కరించారు. రాష్ట్రంలోని 36 ప్రధాన దేవాలయాలతో పాటుగా జోగుళాంబ అమ్మవారి ఆలయంలో భక్తులకు ఆన్‌లైన్ సేవలను అందించేందుకు వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇక పై భక్తులు పరోక్షంగా ఆలయంలోని ఆర్జిత సేవలలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు.

ఫలించిన ఫణీంద్రకుమార్ కృషి

ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాక ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలో అమ్మవారి భక్తులు ఉన్నారని, వీరందరికి ఆలయంలో నిర్వహించే సేవలలో పాల్గొనే అవకాశం కల్పించాలని గతంలో అలంపూర్ యూనియన్ బ్యాంకు మేనేజర్‌గా పనిచేసిన ఫణీంద్రకుమార్ రూ.2.5లక్షలను ఖర్చు చేసి వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఈ వెబ్‌సైట్ ద్వారా దేవస్థానంలో నిర్వహించే అన్ని పూజలకు వీలు కల్పించారు. ఆన్‌లైన్‌లో ఆయా సేవలను ఎంపిక చేసుకుని దేవస్థానం పేరిట ఉన్న అకౌంట్‌కు చెల్లించగానే భక్తులకు తక్షణమే మెసేజ్ వస్తుందని, అలాగే దేవస్థానం వారికి కూడా సమాచారం వస్తుంది.



ఆన్‌లైన్ ద్వారా తొలి డొనేషన్

వెబ్‌సైట్‌ను ప్రారంభించగానే ఎమ్మెల్యే అబ్రహం, శ్రీపీఠం పీఠాధిపతులు బ్రహ్మ నంద సరస్వతి స్వామిజీ ఆన్‌లైన్ ద్వారా తొలి విరాళం సమర్పించి రశీదు పొందారు. ఈ వెబ్‌సైట్ ద్వారా ఆలయంలో ప్రతీ కార్యక్రమానికి సంబంధించిన చిత్రాలు, వీడియోలను కూడా పొందుపరుస్తామని ఈఓ పురేందర్, చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

మరింత సమాచారం..

కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చిన వెబ్‌సైట్‌ను త్వరలోనే మరింత మెరుగైన సమాచారం పొందుపరుస్తాం. ఆలయంలో పూజా కార్యక్రమాలను ముందస్తుగా భక్తులకు వెబ్‌సైట్ ద్వారా తెలియపరచడమే కాకుండా సంబంధిత వీడియోలు, చిత్రాలు ఉంచుతాం. మరింత సమాచారం కోసం వెబ్‌సైట్‌లో దేవస్థానం ప్రతినిధుల ఫోన్ నంబర్లు ప్రదర్శిస్తాం.

– పురేందర్‌కుమార్, ఆలయ ఈఓ

15న మహా సంప్రోక్షణ శుద్ధి

జోగుళాంబ శక్తిపీఠం: ఈ నెల 17 నుంచి 21 వరకు నిర్వహించనున్న మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో మహా సంప్రోక్షణ శుద్ధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓ పురందర్‌కుమార్, చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఆలయాలు మూసివేసి శుద్ధి కార్యక్రమం చేపడుతారని, ఆ సమయంలో భక్తులకు స్వామివారి దర్శనం నిలిపివేస్తామని చెప్పారు. 6.30 దాటిన తర్వాత మహా మంగళహారతి కార్యక్రమాలు, దర్శనాలకు అవకాశం ఉంటుందన్నారు. భక్తులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని దేవస్థానానికి సహకరించాలని వారు కోరారు.

భౌరాపూర్ జాతరకు పటిష్ట ఏర్పాట్లు

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్: శివరాత్రి రోజున భౌరాపూర్‌లో చెంచులు భక్తిశ్రద్ధలతో ఈ నెల 17,18 తేదీల్లో నిర్వహించనున్న శివపార్వతుల కల్యాణోత్సవం కార్యక్రమం, భౌరపూర్ జాతరను సకల సౌకర్యాలతో పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భౌరపూర్ జాతరకు వచ్చే చెంచులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని సౌకర్యాలు సమకూర్చాలని, అందుకు వివిధ శాఖల అధికారులకు బాధ్యతలను అప్పగించారు. ఎక్కడబూ ప్లాస్టిక్ వినియోగం లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయం అలంకరణ, విద్యుద్దీకరణ, వైద్య సదుపాయాలు, 108, ఫైర్ వాహనం, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం వంటి మౌలిక సదుపాయాలతో పాటు చెంచు భక్తుల కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాల్సిందిగా తెలిపారు. అవసరమైన మేరకు సిబ్బందిని, వలంటీర్లను నియమించి అపరిశుభ్రత లేకుండా చూసుకోవాలని అన్నారు. లా అండ్ ఆర్డర్ విషయంలో సైతం పోలీస్ శాఖ అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ట్రాఫిక్‌లో ఏ సమస్య లేకుండా చూసుకోవాలని సూచించారు. అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పాతాళగంగ వద్ద భక్తులు స్నానం ఆచరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాల్సిందిగా ఆదేశించారు. మార్గ మాధ్యలో పెంటల వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య శాఖ అధికారులకు తెలిపారు. అటవీశాఖ అధికారి రోహిత్ గోపిడి మాట్లాడుతూ సాయంత్రం 6గంటలలోపు గమ్యస్థానానికి చేరుకునే విధంగా భక్తులు చూసుకోవాలని, సమయం దాటిన తర్వాత ఎట్టి పరిస్థితిల్లో రిజర్వ్ ఫారెస్ట్ లోపలికి అనుమతించబడదని తెలిపారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, ఆర్డీఓ పాండునాయక్, జిల్లా సంక్షేమ అధికారిణి వెంకటలక్ష్మి, డీఆర్డీఓ ఏఓ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జీ-20 సమ్మిట్‌ను వినియోగించుకోవాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రపంచ శాంతికి వేదికగా జీ–20 సమ్మిట్‌ను వినియోగించుకోవాలని సామాజిక వేత్త, బీఆర్ఎస్ నాయకుడు హనీఫ్ అహ్మద్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జీ–20 దేశాల సమ్మిట్‌లో పాల్గొంటున్న యూరోపియన్, సామ్రాజ్యవాద దేశాలు యుద్ధకాంక్షతో రగిలిపోతున్న తరుణంలో భారత్ ప్రపంచ శాంతికి కొత్తదారి చూపేలా వ్యవహరించాలని కోరారు. దేశ సంపదను కాపాడుకుంటూ ప్రజల సంక్షేమానికి పాలకులు పాటు పడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో నిరుద్యోగం, విద్య, వైద్య, ఆరోగ్యం, వాతావరణ కాలుష్యం, జల వనరుల సురక్షిత ఉపయోగం, కోవిడ్ మహమ్మారి తదితర అంశాలపై చర్చించి మార్గదర్శకమైన నిర్ణయాన్ని తీసుకోవాలని తెలిపారు. ఒకవైపు దారిద్రం తాండవిస్తుండగా మరోవైపు కార్పొరేట్ దోపిడి విధానాలు విలయతాండవం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో సెక్యూలర్ అనేక పదం కాగితాలకే పరిమితమయ్యే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను హోల్‌సెల్‌గా అమ్మేస్తున్నారని ఆరోపించారు. దేశంలో శాంతి, సోదరభావ స్థాపన కోసం ప్రజలు పాటుపడాలని కోరారు.

దిగుబడి పెంచే రకాలపై దృష్టి పెట్టాలి

- దేశీయస్థాయి పరిశోధనలు చేయాలి
- వ్యవసాయ అనుబంధ రంగాలపై రైతులను ప్రోత్సహించాలి
- వీసీ రఘునందన్‌రావు


పాలెం ఆర్ఏఆర్ఎస్‌ను సందర్శించిన వీసీ, స్థానిక శాస్త్రవేత్తలు, అధికారులు

బిజినేపల్లి: రైతులకు అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలపై దృష్టి పెట్టి పరిశోధనలు చేయాలని ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ రఘునందన్‌రావు అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం రైతులకు మరింత సులభంగా ఉండేలా పరిశోధన స్థాయి పెంచాలని, ఆ విధంగా శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. సోమవారం పాలెం ఆర్ఏఆర్ఎస్‌ను వీసీ ప్రత్యేకంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాలెం ఆర్ఏఆర్ఎస్, కేవీకే, ఏజీబీఎస్సీ కళాశాలలను ప్రత్యేకంగా సందర్శించి పరిశోధనలు, వాటి ఫలితాలు, వనరుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం శాస్త్రవేత్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాలెం ఆర్ఏఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రస్తుతం జరుగుతున్న పరిశోధనలు ఏ స్థాయి, వాటి పురోగతి ఉన్నాయో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ రఘునందన్‌రావు మాట్లాడుతూ పాలెం ఆర్ఏఆర్ఎస్‌కు గొప్పచరిత్ర ఉందని, దానిని మసకబారకుండా ఇక్కడి నుంచే రైతులకు దేశీయస్థాయిలో ఉత్తమ ఫలితాలు అందించే పరిశోధనలు చేయాలన్నారు. ఈ పరిశోధనల ద్వారా ఆయా పంటలలో కూలీల ఖర్చు, తగ్గించి, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రైతులకు దిగుబడి పెంచేలా కృషి చేయాలన్నారు. సేంద్రియ వ్యవసాయం, భూసంరక్షణ వంటి వాటిపై రైతులకు ఎక్కువగా అవగాహన కల్పించాలన్నారు. రైతులకు వ్యవసాయమే కాకుండా వ్యవసాయ అనుబంధ రంగాలు అయిన పాడి, పౌల్ట్రీ, గొర్రెల పెంపకం, చేపల, రొయ్యల పెంపకం, యాంత్రీకరణ వంటి వాటిపై అవగాహన పెంచాలని సూచించారు. పాలెం కళాశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు స్థానికంగా చేసిన పరిశోధనలు, వాటి పురోగతి గురించి వివరించాలన్నారు. పాలెం ఆర్ఏఆర్ఎస్, కేవీకేలోని అణువణువు గురించి విద్యార్థులకు తెలియజేయాలన్నారు. పాలెం కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, వాటి ఫలితాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాలను ఇంకా పెంచి రైతుల్లో మరింత అవగాహన పెంచాలని సూచించారు. కాగా జిల్లా వ్యవసాయ యంత్రాంగం ఆధ్వర్యంలో వరిలో డ్రమ్ సీడర్‌ల వినియోగం, రైతు వేదికల ఉపయోగం గురించి అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయంలో యంత్రీకరణ పెంచేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సుదీర్‌కుమార్, డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ జగదీశ్వర్, ఏడీఆర్ డా.యం, గోవర్ధన్, కేవీకే సమన్వయ కర్త డా. ప్రభాకర్‌రెడ్డి, అసోసియేట్ డీన్ డా.పుష్పావతి, డీఏఓ వెంకటేశ్వర్లు, ఆయా విభాగాల శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.